సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 10 । జనవరి । 2023



యాసంగి ఆలస్యం...
జిల్లాలో యాసంగి సీజన్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఇప్పటివరకూ వరితో పాటు ప్రధాన పంటల సాగు పుంజుకోలేదు. 8లో



ఖమ్మం మార్కెట్ కళకళ
మిర్చి, పత్తి విక్రయాలతో ఖమ్మం మార్కెట్ కళకళలాడింది. ధరలు పెరగడంతో రైతులు విక్రయానికి మొగ్గు చూపుతున్నారు. 10లో

వాతావరణం
గరిష్ఠం / కనిష్ఠం
32° / 15°
జిల్లాలో చలి తీవ్రత పెరుగుతుంది. ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోవడంతో పాటు మంచు ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

చుంచుపల్లి: స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ విద్యాలత తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

43మంది కానిస్టేబుళ్లకు ఉద్యోగోన్నతి

ఖమ్మంక్రైం: భద్రాది-4జోన్ పరిధిలోని 43మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి లభించింది. ఈమేరకు డీఐజీ రంగనాథ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ జిల్లాల కానిస్టేబుళ్లు ఉండగా, ఎంతోకాలం తర్వాత ఉద్యోగోన్నతి లభించడంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

చుంచుపల్లి: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీకి తాత్కాలిక మెరిట్ జాబితా ప్రకటించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాబితా వివరాలను సంబంధిత వైబ్ సైట్‌తో పాటు డీఎంహెచ్‌ఓ కార్యాలయం బోర్డుపై అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే బుధవారం సాయంత్రం 5 గంటలలోపు తెలియజేయాలని సూచించారు.

కంటి వెలుగుకు ఖమ్మం నుంచే శ్రీకారం

- ముగ్గురు సీఎంల చేతుల మీదుగా రెండో దశ
- ఏర్పాట్లుచేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ

ఖమ్మం వైద్యవిభాగం: కంటి వెలుగు రెండోదశ కార్యక్రమాన్ని ఖమ్మం నుంచి లాంఛనంగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రపాయంగా నిర్ణయించింది. ప్రపంచంలోనే అతి పెద్ద నేత్రపరీక్ష కార్యక్రమాన్ని మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించాలని నిర్ణయించిన ట్లు సమాచారం. ఇందులో భాగంగానే ఈనెల 18న ఖమ్మంలో కలెక్టరేట్‌ను ప్రారంభించాక రెండో విడత కంటివెలుగు కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం నిర్వహించిన తొలి విడత కంటివెలుగు కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.54 కోట్ల మందికి పరీక్షలు నిర్వహించి 50 లక్షల మందికి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సారి కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతీ ఒక్కరికీ పరీక్షలు నిర్వహించి, సుమారు 60లక్షల కళ్లద్దాలు అందించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ కార్యక్రమం జిల్లాలో మూడు నెలల పాటు సాగనుండగా, 589 గ్రామపంచాయితీలు, 125 వార్డుల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

కొత్త కలెక్టరేట్‌లో ప్రారంభం

ఖమ్మంలో నిర్మించిన కొత్త కలెక్టరేట్ ప్రారంభ సమావేశానికి హాజరుకానున్న సీఎం కేసీఆర్ అదే రోజు కంటి వెలుగు రెండో దశ కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. అదే రోజు జరిగే బహిరంగ సభకు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. ఈమేరకు కొత్త కలెక్టరేట్ భవనంలోనే కంటి వెలుగును ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం సోమవారం వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నూతన కలెక్టరేట్‌ను పరిశీలించారు.

మహా ప్రసాదం

- భద్రాచలం, పర్ణశాలలో భక్తులకు సకల వసతులు
- ప్రసాద్ పథకంలో రూ.41 కోట్లు విడుదల చేసిన కేంద్ర టూరిజం శాఖ
- వేగం పుంజుకోనున్న అభివృద్ధి పనులు

భద్రాచలం: భక్తులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రామాలయ అభివృద్ధికి తొలి అడుగులు పడ్డాయి. కేంద్ర ప్రభుత్వం, పర్యాటక మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో 'పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిర్చువల్ ఆగ్‌మెంటేషన్ డ్రైవ్(ప్రసాద్)' పథకంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు గత నెల 28న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సుమారు రూ.41 కోట్ల విలువైన పనులు భద్రాచలం, పర్ణశాల దేవస్థానాల పరిధిలో జరగనున్నాయి. పనుల ప్రారంభానికి టూరిజం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కేంద్ర టూరిజం శాఖ నుంచి రూ.41 కోట్లు విడుదల చేస్తూ జీఓ కూడా జారీ అయింది. దీంతో చేపట్టనున్న పనులకు సంబంధించిన క్లియరెన్స్, అంచనాలు, టెండర్ల ఖరారుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వీటన్నింటినీ పూర్తి చేసి త్వరలోనే అభివృద్ధి పనులను పట్టాలెక్కించనున్నారు.

భక్తులు అబ్బురపడేలా..

భద్రాచలం, పర్ణశాల దేవస్థానాల పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి టూరిజం అధికారులు పలుమార్లు ఆలయాలను పరిశీలించి తొలుత రూ.92.04 కోట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే గత నెల 28న భద్రాద్రి రామయ్య దర్శనానికి రాష్ట్రపతి పర్యటన ఖరారు కాగానే ఈ అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.41,38,07,970 నిధులను మంజూరు చేసింది. ఇందులో రామాలయం, ఉపాలయాలు, మిథిలా స్టేడియం, ప్రసాదం తయారీ కేంద్రంలతో పాటు పలుచోట్ల అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించారు. ప్రధానంగా రామాలయంలో నిత్యకల్యాణం రూఫింగ్‌కు రూ.1.09 కోట్లు, హనుమాన్ టెంపుల్ వద్ద రూఫింగ్‌కు రూ.1.92 కోట్లు, మిథిలా స్టేడియంలో డిటాచబుల్ రూఫ్‌నకు రూ.1.69 కోట్లు, వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం లిఫ్ట్‌కు రూ.47 లక్షలు, భక్తుల లిఫ్ట్‌ల సివిల్ పనులకు రూ.21 లక్షలు కేటాయించారు. అదేవిధంగా నిత్యకల్యాణ మండపంలో రూ.47 లక్షలు, హనుమాన్ టెంపుల్ ఏరియాలో రూ.40 లక్షలతో ఫ్లోరింగ్ పనులు చేపట్టనున్నారు. మెట్ల మార్గం, క్యూలైన్లలో రెయిలింగ్‌కు రూ.10 లక్షలు, ప్రసాదాల తయారీ విభాగాన్ని పెంచడం, ఆధునికీకరణకు, మిషనరీల కొనుగోలుకు రూ.70 లక్షలు అవసరమని ప్రతిపాదనలు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో, హరిత హోటల్ రోడ్డు నుంచి ఆలయం



భద్రాచలం పట్టణ ప్రవేశంలో ఉన్న ఐదెకరాల ఆర్‌అండ్‌బీ స్థలంలో భక్తుల కోసం నిర్మించనున్న వసతిగృహాల నమూనా చిత్రం



గత నెల 28న ప్రసాద్ పథకానికి శంకుస్థాపన చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము(ఫైల్)

వరకు ఇరువైపులా షెల్టర్లు, బెంచీలు, సెంట్రల్ లైటింగ్ సిస్టంల కోసం రూ. 95 లక్షలు, గోదావరి ఒడ్డున ఘాట్ ఏరియాలో భక్తులు దుస్తులు మార్చుకునే గదులు, బయో టాయ్‌లెట్స్, జెట్టీల ఏర్పాటుకు రూ.1.34 కోట్లు కేటాయించారు. పట్టణ ప్రవేశంలో రూ.74 లక్షలతో స్వాగత ద్వారం, రెండెకరాల స్థలంలో యాత్రికుల సౌకర్యార్థం గదులు, వ్రత మండపాలకు రూ.10 కోట్లు, ఐదెకరాల స్థలంలో క్యాంటిన్, వాష్ రూంలు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.3.10 కోట్లు, అలాగే కాటేజీల నుంచి ఆలయం వరకు, మాడ వీధులలో భక్తుల కోసం బ్యాటరీ వాహనాలకు రూ.75 లక్షలు, భక్తులకు స్వాగతం పలికేలా రూ.2.43 కోట్లతో స్టోన్ స్వాగత ద్వారం ఏర్పాటు చేయనున్నారు.

పర్ణశాల ఆలయానికి మహర్దశ..

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి పర్ణశాల రామాలయం అనుబంధంగా ఉంది. భద్రాచలం వచ్చిన భక్తులంతా పర్ణశాల క్షేత్రాన్ని దర్శించుకుంటారు. ఇంతటి ప్రాశస్త్యం గల ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేయడంలో రామాలయ అధికారులు నిర్లక్ష్యం వహించారు. ప్రసాద్ పథకంలో మాత్రం కేంద్ర ప్రభుత్వం పర్ణశాల అభివృద్ధికి తగిన చోటు కల్పించింది. సుమారు రూ.10 కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించనున్నారు. పర్ణశాల, సీతమ్మ వాగు వద్ద భక్తుల విడిది కోసం రూ.4 కోట్లతో భవనం, వెయిటింగ్ హాలు, స్థానిక వ్యాపారుల దుకాణాలు, క్యాంటీన్లు, సెంట్రల్ లైటింగ్, బయో టాయ్‌లెట్స్, క్యూలైన్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రెయిన్ షెల్టర్స్ తదితర పనుల కోసం రూ.4.92 కోట్లు కేటాయించారు. ఇక భద్రాచలం, పర్ణశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. కోటి వెచ్చించనున్నారు.

కేసీఆర్ దృష్టి పెడితే మరింత అభివృద్ధి..

భద్రాచలం దేవస్థానం, పట్టణ ప్రజలపై తెలంగాణ సీఎం కేసీఆర్ దృష్టి పెడితే మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని భక్తులు అంటున్నారు. 2014లో సీఎం హోదాలో శ్రీరామనవమికి పట్టువస్త్రాలు, ముత్యాలను తీసుకొచ్చిన సీఎం కేసీఆర్.. అభివృద్ధి పనులకు రూ.100 కోట్లు ఇస్తామని ప్రకటించారు. ఆ తర్వాత రాష్ట్ర బడ్జెట్‌లో పలుమార్లు నిధులను కేటాయించినా మంజూరు మాత్రం కాలేదు. ఇంతలోనే కేంద్ర ప్రభుత్వం టూరిజం శాఖ నుంచి రూ.41 కోట్లు ప్రసాద్ పథకం కింద మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 12న కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి కేసీఆర్ రానున్న నేపథ్యంలో మళ్లీ భక్తుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇచ్చిన మాట ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి దీటుగా రూ.100 కోట్లు విడుదల చేస్తే భద్రాచలం అభివృద్ధికి ఇక అడ్డే ఉండదని పలువురు అంటున్నారు. యాదాద్రి ఆలయ నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ఇప్పటికైనా భద్రాద్రి రామయ్య వైపు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

వైభవంగా 'దొంగల దోపు'

- విశ్రాంతి మండపంలో రామయ్యకు రాపత్తు సేవ
- రేపు రామాలయంలో కూడార్ై ఉత్సవం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారికి దొంగల దోపు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్కి అవతారంలో ఉన్న స్వామివారికి ఎదురుగా జరిగిన ఈ వేడుకలో ఆలయ సిబ్బంది ఆసక్తికరంగా నటించారు. పరకాలుడి వేషం ధరించిన వ్యక్తి శంఖుచక్రాలు, గొడుగు దొంగతనం చేయగా భటుల వేషధారులైన వారు అతడిని పట్టుకుని స్వామివారికి అప్పచెబుతారు. నిందితులు తమ తప్పును అంగీకరించి స్వామి వారిని క్షమించమని అడుగగా మన్నిస్తారు. దీన్ని దృశ్య రూపంలో అభినయించిన ఆలయ సిబ్బందిని పలువురు అభినందించారు.

స్వామివరాకి రాపత్తు సేవ..

స్థానిక రాజవీధిలో ఉన్న విశ్రాంత మండపంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారికి రాపత్తు సేవ ఘనంగా జరిపారు. తొలుత మేళతాళాలు, కోలాటాల నడుమ పల్లకీలో స్వామివారిని మండపం వద్దకు తీసుకొచ్చి వేంచేపు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు, పండితులు ప్రత్యేక పూజలు చేసి హారతి సమర్పించారు. భక్తులు స్వామివారికి ఘనంగా స్వాగతం పలికారు.



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

రేపు కూడార్ై ఉత్సవం..

రామాలయంలో బుధవారం కూడార్ై ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు జరిగే ఈ ఉత్సవంలో పాల్గొనదలిచిన భక్తులు రూ.200 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వారికి స్వా మి వారి ప్రసాదం అందజేస్తామని వెల్లడించారు.

నిరభ్యంతర పత్రాలు ఇస్తాం

ఐటీడీఏ పీఓ హామీ

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉన్నత విద్యాభ్యాసం కోసం కోరిన చోటకు వెళ్లేలా నిరంభ్యంతర పత్రాలు ఇస్తామని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. సోమవారం ఆయన్ను ఐటీడీఏలో ఉపాధ్యాయులు, టీపీటీఎఫ్ నాయకులు కలిసి సమస్యలు వివరించారు. దీంతో స్పందించిన పీఓ పత్రాలను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. సంఘం జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు బి.రాజు, జి.హరిలాల్, మునిగడప రామాచారి తదితరులు పాల్గొన్నారు.



పీఓకు సమస్యలు వివరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

నిర్వాసితుల దీక్ష విరమణ

సింగరేణి(కొత్తగూడెం): గోదావరి వరదలతో సర్వస్వం కోల్పోయిన తమకు ఇంటి స్థలాలు ఇచ్చి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని కోరుతూ 149 రోజులుగా దీక్ష చేస్తున్న నిర్వాసితులు.. ఎట్టకేలకు కలెక్టర్ హామీతో ఆందోళన విరమించారు. నిర్వాసితుల సమస్యలపై సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం నాటి గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయగా.. దీక్ష విరమిస్తే సమస్యను కచ్చితంగా పరిష్కరిస్తామని అనుదీప్ హామీ ఇచ్చారు. తొలుత పార్టీ నాయకులు ఆవునూరి మధు, కుంజా కృష్ణ, కందగట్ల సురేందర్ మా ట్లాడుతూ.. వరద బాధితులు, పేదలు సారపాక క్రాస్ రోడ్డు సమీపంలోని ప్రభుత్వ భూ మిలో గుడిసెలు వేసుకుంటే అటవీ అధికారులు గుడిసెలు తొలగించారని, దీనిపై బాధితులు హైకోర్టును ఆశ్రయిస్తే ఇంటి స్థలాలు ఇవ్వాలని కోర్టు కూడా తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు.

కోర్టు తీర్పు మేరకైనా ఇంటి స్థలాలు, పట్టాలు ఇవ్వాలని కోరగా, కలెక్టర్ పైవిధంగా హామీ ఇవ్వడంతో దీక్ష విరమిస్తున్నట్లు నిర్వాసితులు ప్రకటించారు. కార్యక్రమంలో ఎన్డీ నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, బండ్ల వెంకటేశ్వర్లు, భూక్యా కిషన్, వెంకన్న, రామకృష్ణ, ఆర్.లక్ష్మి మమత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ సార్ !

- బీఆర్‌ఎస్ తొలి సభా వేదికగా ఖమ్మంను ఎంచుకోవడంపై హర్షం
- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి పువ్వాడ, నేతలు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: టీఆర్‌ఎస్ బీఆర్‌ఎస్‌గా మారాక ఆవిర్భావ తొలిసభను ఖమ్మంలో నిర్వహించాలని పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈనెల 18న కలెక్టరేట్‌ను ప్రారంభించడమే కాక అదే రోజు బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభ నిర్వహించనున్నట్లు ఆదివారం సాయంత్రం ప్రకటించారు. దీంతో కలెక్టరేట్ సమీపాన ఎంపిక చేసిన స్థలంలో ఏర్పాట్లు సోమవారం మొదలయ్యాయి. ఈ సందర్భంగా తొలిసభ ఖమ్మంలో నిర్వహించాలని నిర్ణయించినందుకు జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్,, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితర కీలక నేతలు సోమవారం హైదరాబాద్ ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అధినేతతో సమావేశమైన జిల్లా నేతలు బహిరంగ సభను కనీవిని ఎరుగని రీతిలో విజయవంతం చేసేందుకు చేయనున్న ఏర్పాట్లను వివరించగా... కేసీఆర్ సైతం జనసేకరణ తదితర అంశాలపై సూచనలు చేశారు. సీఎంను కలిసిన వారిలో మంత్రి పువ్వాడతో పాటు ఎంపీ నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, విప్ రేగా కాంతారావు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోతు హరిప్రియ ఉన్నారు.



సీఎం కేసీఆర్‌తో మంత్రి పువ్వాడ

సమస్యలు సత్వరమే పరిష్కరించండి



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కలెక్టర్, పక్కన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్వో అశోక్‌చక్రవర్తి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- ప్రజావాణిలో వినతుల స్వీకరణ

కొత్తగూడెంఅర్బన్: ప్రజావాణిలో వచ్చిన సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పలువురి నుంచి వినతులు స్వీకరించారు. ఆయా దరఖాస్తులను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో మాట్లాడారు. పరిష్కరించిన దరఖాస్తులపై తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల్లో కొన్ని ఇలా..

- చర్ల మండలం రామానుజాపురం గ్రామంలో 60 గిరిజన కుటుంబాలు ఉన్నాయని, గత 30 ఏళ్లుగా అక్కడే నివసిస్తున్నామని, తమ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారని, అక్కడ సౌకర్యాలు సక్రమంగా లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారని స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి శాశ్వత భవనం నిర్మించాలని కోరారు. దీంతో తగు చర్యల నిమిత్తం మహిళా సంక్షేమశాఖాధికారికి ఎండార్స్ చేశారు.
- చుంచుపల్లి మండలం బదావత్‌తండాకు చెందిన బదావత్ హరిలాల్ దంపతులు.. తమ పేరున ఉన్న నివాస గృహాన్ని తమ పేరున నమోదు చేయాలంటూ కుమారుడు, కోడలు ఇబ్బంది పెడుతున్నారని, తమను ఇంటి నుంచి గెంటివేశారని ఫిర్యాదు చేయగా రక్షణ చర్యలు చేపట్టాలంటూ ఆర్డీఓ, చుంచుపల్లి తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.
- తాను దివ్యాంగుడినని, తనకు ఇల్లు, ఇంటి స్థలం లేదని, దివ్యాంగుల కోటాలో తనకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలని మణుగూరు మండలం సమితి సింగారం గ్రామానికి చెందిన ఎస్‌కే ఇమాం దరఖాస్తు చేయగా డీఆర్‌ఓకు ఎండార్స్ చేశారు.
- మైనారిటీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న రుణాల్లో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని, అర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా దరఖాస్తు చేయగా, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేయాలి

నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి ఈనెల 12న సీఎం కేసీఆర్ వస్తున్నందున ఏర్పాట్లు సిద్ధం చేయాలని కలెక్టర్ అనుదీప్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన అన్ని శాఖల అధికారులతో కలిసి కొత్త కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా అధికారులకు కేటాయించిన విధులను అంకితభావంతో నిర్వహించాలని చెప్పారు. ఆహ్లాదకర వాతావరణంలో నిర్మించిన నూతన కలెక్టరేట్‌లో అన్ని శాఖలకు కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలన్నారు. వాహనాల పార్కింగ్ పనులను పర్యవేక్షించాలని రవాణా శాఖా అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీపీఓ రమాకాంత్, డీసీఓ వెంకటేశ్వర్లు, ఉద్యాన అధికారి మరియన్న, ఆర్‌ఐఓ సులోచనారాణి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, పశుసంవర్ధక అధికారి డాక్టర్ పురంధర్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన పనులు..

- తవ్వకాలతో పగిలిన పైపులైన్లు
- తాగునీరు లేక ప్రజల ఇక్కట్లు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. పర్యవేక్షించాల్సిన మున్సిపల్ అధికారులు పట్టనట్టుగా వ్యవహరించడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణంలోని లేపాక్షి రోడ్డు, సూపర్ బజార్ నుంచి సింగరేణి ప్రధాన ఆస్పత్రి వరకు సుమారు 45 రోజుల క్రితం డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో గుంతలు తవ్వించారు. అయితే ఆ వెంటనే పనులు చేపట్టాల్సి ఉండగా.. కాంట్రాక్టర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా నిర్ణయించిన కొలతల ప్రకారం డ్రెయినేజీ నిర్మించడం లేదని, వ్యాపారులకు అనుకూలంగా పనులు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సదరు వ్యాపారులతో కాంట్రాక్టర్లు బేరం కుదుర్చుకుంటున్నారని, ఒప్పందం కుదిరేంత వరకు పనులు చేపట్టకపోవడంతో జాప్యం జరుగుతోందని అంటున్నారు. డ్రెయినేజీల కోసం తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయని, మున్సిపల్ అధికారులైనా స్పందించి పనులను వేగవంతం చేయాలని కోరుతున్నారు.



పట్టణంలో అసంపూర్తిగా డ్రెయినేజీ పనులు

తవ్వకాలతో పగిలిన పైపులు..

పట్టణంలో అభివృద్ధి పనుల పేరుతో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టారు. దీంతో కిన్నెరసాని పైపులైన్లు సూపర్‌బజార్, సెవెన్‌హిల్స్ తదితర ఏరియాలలో పగిలిపోయాయి. ఆయా ప్రాంతాల్లో గత వారం రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పగిలిపోయిన పైపులైన్లను వెంటనే మరమ్మతులు చేయించి నీటి సదుపాయం కల్పించాలని వారు కోరుతున్నారు. అభివృద్ధి అంటూ సమస్యలు సృష్టిస్తున్నారని కాంట్రాక్టర్, అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధానరోడ్డులో నిర్మాణానికి రెండు నెలలా..?

జిల్లా కేంద్రంలోని సూపర్‌బజార్ సెంటర్ పెట్రోల్ బంకు వద్ద ప్రధాన డ్రెయినేజీ లీక్ కావడంతో కొత్తగా నిర్మించేందుకు తవ్వకాలు చేపట్టి రెండు నెలలు అవుతోంది. అప్పటి నుంచి పనులు ఇంకా పూర్తి కాలేదు. ఆ రోడ్డులో నిత్యం వాహనాల రాకపోకల రద్దీ ఉంటుంది. సూపర్‌బజార్‌లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఆ రోడ్డులో బ్యాంక్‌లు, వస్త్ర దుకాణాలు, మద్యం దుకాణాలు, ఎలక్ట్రానిక్ షాపులు ఎక్కువగా ఉన్నాయి. దీంతో రద్దీ విపరీతంగా ఉంటుంది. అయితే ఆ రోడ్డులో పనులు ఆలస్యంగా జరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన రోడ్డులో డ్రైనేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం

కొత్తగూడెంలోని సూపర్‌బజార్ సెంటర్ పెట్రోల్ బంకు వద్ద డ్రెయినేజీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. జాప్యానికి గల కారణాలు తెలుసుకొని వేగవంతం చేయిస్తాం. ఆ రోడ్డులో పనులు, పైపులైన్ పనులను వెంటనే చేయించి నీటి సదుపాయం కల్పిస్తాం.

– రఘు, మున్సిపల్ కమిషనర్

పాల్వంచలో ఆక్రమణల తొలగింపు

పాల్వంచ: పట్టణ పరిధిలోని నవభారత్ వద్ద నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈనెల 12న ముఖ్యమంత్రి కేసీఆర్ కలెక్టరేట్‌ను ప్రా రంభించనున్న నేపథ్యంలో కలెక్టరేట్‌కు ఇరువైపులా ఇటీవల ఏర్పాటు చేసుకున్న డబ్బాకొట్లు, ఇతర షెడ్లు, నిర్మాణాలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. కలెక్టరేట్ ముందు భాగంలో ఏర్పాటు చేసిన షాపులు తొలగించా లని 15 రోజుల క్రితమే మున్సిపల్ అధికారులు ఆదేశాలు జారీ చేసినా ఎవరూ స్పందించలేదు. దీంతో మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్, టీపీఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.



డబ్బాకొట్టును తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

క్లుప్తంగా

జేకే ఓసీ విస్తరణకు అనుమతులు ఇప్పించండి


కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న సింగరేణి అధికారులు

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాలో జేకే ఓసీ విస్తరణకు అనుమతి ఇప్పించాలని సింగరేణి అధికారులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్‌ను డైరెక్టర్ (పా) ఎస్. చంద్రశేఖర్, ఇల్లెందు జీఎం షాలేము రాజు కలిసి విన్నవించారు. ప్రస్తుతం సాగుతున్న జేకే-5 ఓసీ జీవిత కాలం మరో రెండు నెలల్లో ముగుస్తుందని, జేకే ఓసీ విస్తరణ వచ్చే మూడు నెలల్లో ప్రారంభించాల్సి ఉందని వివరించారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ స్వర్ణలత, ఇల్లెందు తహసీల్దార్ కృష్ణవేణి, అధికారులు రవి ప్రసాద్, నీరజ్ పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక


విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చంద్రుగొండ : కేంద్రశాస్త్ర సాంకేతిక మండలి ప్రతి ఏటా నిర్వహించే ఇన్‌స్పైర్ పరీక్షల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపి అవార్డుకు ఎంపికయ్యారు. సీతాయిగూడేనికి చెందిన 7వ తరగతి విద్యార్థిని కనకం నాగశరణ్య, చంద్రుగొండకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కొట్టి ఆదిత్య, మద్దుకూరుకు చెందిన 9వ తరగతి విద్యార్థి వల్లపు అనిల్ 2022-2023 ఏడాది అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం చంద్రుగొండలోని జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. అవార్డుకు ఎంపికైన విద్యార్థులకు రూ.10 వేల నగదుతోపాటు ఆయా రంగాల్లో ప్రాజెక్టుల రూపకల్పనలో ఎంపిక చేస్తారు. అభినందించినవారిలో హెచ్‌ఎం ఉండేటి ఆనంద్‌కుమార్, ఎండీ ఆరీఫ్‌హుసేన్, వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అక్రమాలపై విచారణ జరపాలి


మాట్లాడుతున్న కామేష్

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇటీవల అక్రమ పద్ధతిలో చేపట్టిన ఉద్యోగ నియామకాలపై విచారణ జరిపించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ కోరారు. పట్టణంలో హరిత హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలం, సుదిమళ్ల, కిన్నెరసాని, దమ్మపేట, గుండాల, ఎస్ఓఈ ఖమ్మంలో ఖాళీగా ఉన్న 42 జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు తాత్కాలిక ప్రాతిపదికన నోటిఫికేషన్ విడుదల చేశారని అన్నారు. అధికారులు 42 ఖాళీల్లో 52 మందిని నియమించారని, నియామకాల్లో రూ.లక్షలు చేతులు మారాయని ఆరోపించారు. ఈ సమావేశంలో తడికల శివకుమార్, సోడె వీర స్వామి తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ గురుకులానికి అవార్డు


అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్

కారేపల్లి: కారేపల్లిలో కొనసాగుతున్న ఇల్లెందు సాంఘిక సంక్షేమ గురుకులం స్వచ్ఛ గురుకుల్ అవార్డుకు ఎంపికైంది. గత ఏడాది సెప్టెంబర్ 5నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన పోటీల్లో గురుకులం ప్రథమస్థానంలో నిలవగా భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ డి.అనుదీప్ రూ.20వేల నగదు బహుమతిని ప్రిన్సిపాల్ కందుల లిల్లీకి అందజేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను ప్రిన్సిపాల అభినందించారు.

గంజాయి స్వాధీనం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సోమవారం 25 కేజీల గంజాయి పట్టుబడింది. పోలీసుల కథనం ప్రకారం.. సీఐ నాగరాజు, ఎస్సై శ్రీకాంత్ తనిఖీలు చేపడుతున్న క్రమంలో బస్టాండ్ ఆవరణలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి వద్ద ఉన్న బ్యాగ్ తనిఖీ చేసి, 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశాలోని మల్కాన్‌గిరి ప్రాంతం మెట్టగుడకు చెందిన పోడియం జోగా, పునెం నందా అనే వ్యక్తులు మల్కాన్‌గిరి నుంచి విజయవాడకు గంజాయి తరలిస్తున్నట్లు తేలింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,881

యాసంగి ఆలస్యం..


సాగు చేసిన వరిపంట

- సాధారణ సాగు విస్తీర్ణం 2,15,463 ఎకరాలు
- ఇప్పటివరకు సాగైనది 86,589 ఎకరాలు
- లక్ష్యాన్ని చేరుకున్న ఆయిల్‌పామ్ తోటలు
- సాగులో మిరప, వేరుశెనగ పంటలు ముందంజ


లక్ష్మీదేవిపల్లి మండలంలో మొక్కజొన్న సాగు..

వివిధ పంటల సాగు విస్తీర్ణం వివరాలు (ఎకరాల్లో..)

పంట	విస్తీర్ణం	సాగైనది	శాతం
వరి	78,762	1,553	2
జొన్న	2,147	10	0
మొక్కజొన్న	26,156	5,776	22
పత్తి	42	20	48
పెసర	2,896	160	6
మినుము	1,986	288	15
కంది	142	45	32
అలసంద	2,617	444	17
ఉలవలు	35	2	6
శెనగ	49	0	0
జనుము	282	18	6
వేరుశెనగ	2,138	1,038	49
పొద్దుతిరుగుడు	2,112	24	1
నువ్వులు	1,123	34	3
చెరకు	415	38	9
పొగాకు	762	155	20
మిరప	5,639	5,431	96
ఆయిల్‌పామ్	38,757	38,757	100
కూరగాయలు	3,864	52	1
ఇతరాలు	45,539	32,744	72
మొత్తం	2,15,463	86,589	40

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో యాసంగి సీజన్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఇప్పటివరకు కూడా వివిధ పంటల సాగు పుంజుకోలేదు. ప్రధానంగా వరి కోతలు ఇప్పుడిప్పుడే పూర్తి కావడం ఒక కారణంగా చెప్పవచ్చు. కోతల తరువాత కలియదున్ని వరి నారు పోసి తరువాత నాటు వేసుకునే పరిస్థితులు మొదలయ్యాయి. మరికొందరు ఇప్పటికే వరినారు పోసుకున్నారు. కొందరు వరి నాట్లను ప్రారంభించారు. ఈ సీజన్‌లో వరిసాగు లక్ష్యం 78,762 ఎకరాలు కాగా ఇప్పటికి కేవలం 1,553 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. 2 శాతం మాత్రమే సాగైంది. జిల్లాలో యాసంగి సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 2,15,463 ఎకరాలుగా నిర్ణయించగా ఇప్పటివరకు కేవలం 86,589 ఎకరాల్లో మాత్రమే వివిధ పంటలు వేశారు. వీటిలో ప్రభుత్వ ఆదేశానుసారం ముందుగా వ్యవసాయ, ఉద్యాన శాఖల సమన్వయంతో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని పూర్తి చేశారు. వేసిన పంటలలో తరువాతి స్థానంలో మిరప లక్ష్యం 5,639 ఎకరాలు కాగా 5,431 ఎకరాల్లో సాగు పూర్తికాగా, 96 శాతం నమోదైంది. వేరుశెనగ 2,138 ఎకరాల లక్ష్యానికి 1,038 ఎకరాల్లో సాగు చేపట్టారు. వరికి ప్రత్యామ్నాయంగా మరికొన్ని చోట్ల మొక్కజొన్న పంటను వేస్తున్నారు. గుండాల, ఆళ్లపల్లి ప్రాంతాలలో పొద్దుతిరుగుడు పంటను పండించడం ప్రతిసంవత్సరం ఆనవాయితీగా ఉంది. ఈ సీజన్‌లో కాడా ఆ మండలాల్లో రైతులు పొద్దు తిరుగుడు పంట పండిస్తున్నారు.

పంట విస్తీర్ణాలు ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి



యాసంగి పంట విస్తీర్ణం ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. ప్రధానంగా వానాకాలం సీజన్‌లో వరి ఆలస్యం కావడంతో యాసంగిలో కూడా ఈ ప్రభావం కనిపిస్తోంది. వరి సాగు ప్రారంభమైంది.

–కొర్స అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

గత సీజన్ వల్లే ఆలస్యం..



వానాకాలం సీజన్‌లో అతివృష్టి వల్ల పంటలు ఆలస్యంగా జరిగాయి. ఆ ప్రభావంతో సీజన్ ఆలస్యమైంది. దీంతో యాసంగిలో కూడా అదే ఆలస్యం కొనసాగుతోంది. ఈ సీజన్‌లో కూడా వరి వేస్తున్నాను.

–ప్రసాద్, రైతు, లక్ష్మీదేవిపల్లి మండలం

రద్దయిన రైళ్లను పునరుద్ధరించాలి

కొత్తగూడెంఅర్బన్: కరోనా వైరస్ వ్యాప్తి సమయంలో రద్దు చేసిన రైళ్లను భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి తిరిగి ప్రారంభించాలని కోరుతూ కొవ్వూరు రైల్వేలైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్టేషన్ ఆవరణలో ఆందోళన నిర్వహించారు. రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ కొదమసింహం పాండురంగాచార్యులు మాట్లాడుతూ కరోనాకు ముందు భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి నడిచిన అన్ని రైళ్లను పునరుద్ధరించాలన్నారు. కొత్తగూడెం నుంచి కాజీపేట, డోర్నకల్ వెళ్లే ప్యాసింజర్లను తక్షణం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొండి గణేష్ సతీష్ యాదవ్, పవన్ కళ్యాణ్, సంతోష్, సాయి, శంకర్, కృష్ణ, హతిరం, బిక్షం, వినోద్ పండు, నరేందర్, నవీన్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.


రైల్వే స్టేషన్ ఆవరణలో ఆందోళన చేస్తున్న కమిటీ సభ్యులు

భూ వివాదంలో పరస్పరం దాడులు

దమ్మపేట: భూవివాదం కారణంగా రెండు కుటుంబాలు పరస్పరం దాడి చేసుకున్న సంఘటన మండల పరిధిలోని నాచారం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... నాచారం గ్రామానికి చెందిన రెండు కుటుంబాలు భూవివాదం నేపథ్యంలో పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఇరు వర్గాలూ పోలీసులకు ఫిర్యాదు చేశాయి. గద్దల శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు వేముల రవి, వేముల పుల్లయ్య, వేముల సాయి, వేముల వెంకటకృష్ణ, వేముల వెంకన్నలపై దాడి కేసు నమోదు చేశామని, అదేవిధంగా వేముల పుల్లయ్య ఫిర్యాదు మేరకు గద్దల శ్రీను, గద్దల విజయ్, గద్దల శశికుమార్, గద్దల మంగలపై దాడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ప్రజా అవసరాలకు ఇసుక ఇవ్వాలి

చర్ల: మండలంలోని తాలిపేరు, గోదావరి నదుల నుంచి ప్రజల అవసరాలకు ఇసుక తరలించుకునేందుకు అనుమతించాలని కోరుతూ పౌర సమితి ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన బస్టాండ్ సెంటర్, అంబేడ్కర్ సెంటర్, యూనియన్ బ్యాంక్ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం తహసీల్దార్ భరణిబాబుకు పౌర సమితి నాయకులు, అఖిల పక్ష నాయకులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కోదండరామయ్య, జెడ్పీటీసీ ఇర్పా శాంత, టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల వచ్చిన గోదావరి వరదలు మండల ప్రజానీకాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని అన్నారు. ఇంటి నిర్మాణాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు, ప్రహరీ నిర్మాణాలకు అవసరమైన ఇసుక తీసుకునేందుకు అధికారులు అభ్యంతరం చెబుతున్నారని ఆరోపించారు.


ప్రదర్శన నిర్వహిస్తున్న పౌర సమితి సభ్యులు, పార్టీల నాయకులు

అనుమతులు ఇవ్వాలి

చర్ల: రైతులు, ప్రజల అవసరాలకు ఇసుక తరలించేందుకు అనుమతులు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి కోరారు. చర్ల మండలంలోని సుందరయ్య కాలనీలో సోమవారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. రైతుల పేరు చెప్పి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అక్రమంగా ఇసుక, మట్టి రవాణా చేసే వాహనాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డివిజన్ నాయకులు సాయన్న, మండల కార్యదర్శి కొండా చరణ్, లంకా వెంకట్, ముసలి సతీష్, రేగా ఆంద్రయ్య, కౌశిక్, సాంబ పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

భద్రాచలంఅర్బన్: చెల్లని చెక్కు కేసులో ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి నీలిమ సోమవారం తీర్పుచెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. కందుల వాణిశ్రీ అనే మహిళ దగ్గర అశ్వాపురం గ్రామానికి చెందిన వేములపల్లి రాంప్రసాద్ అనే వ్యక్తి చెక్కు హామీగా పెట్టి రూ. 8,00,000 అప్పు తీసుకున్నాడు. సదరు చెక్కును వాణిశ్రీ బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీంతో ఆమె న్యాయవాదులు జె.గోపికృష్ణ, ఎం.కిశోర్ ద్వారా కోర్టులో కేసు వేసింది. కోర్టులో వాదోపవాదాలు విన్న తర్వాత ముద్దాయి వేములపల్లి రాంప్రసాద్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు న్యాయమూర్తి చెప్పారు. రూ.8,00,000 పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

మరో ఘటనలో..

సరివెళ్ల ఆనంద్ కుమార్ అనే వ్యక్తి వద్ద జెట్టి పీటర్ అనే వ్యక్తి చెక్కు హామీగా పెట్టి 2,00,000 అప్పు తీసుకున్నాడు. సదరు చెక్కును బ్యాంక్‌లో డిపాజిట్ చేయగా బౌన్స్ అయింది. దీంతో ఆనంద్‌కుమార్ న్యాయవాది డి.రాము ద్వారా కోర్టును ఆశ్రయించాడు. పూర్వాపరాలను పరిశీలించిన న్యాయస్థానం ముద్దాయి పీటర్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. రూ. 2,00,000 నష్ట పరిహారం చెల్లించాలని, పరిహారం రెండు నెలల్లో చెల్లించకపోతే మరో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొంది.



జిల్లా సరిహద్దు గ్రామమైన వినోభానగర్‌లో పోలీసులు సోమవారం రాత్రి విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ నెల 12న రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పోలీసులు ఇక్కడ చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. ఎస్సై పోటు గణేష్ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు.

– జూలూరుపాడు

భూ వివాదం.. పాఠశాల దారికి కంచె


ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న చిన్నారులు, తల్లిదండ్రులు

టేకులపల్లి: ప్రైవేటు పాఠశాలకు వెళ్లే దారిలో కంచె వేయడంతో సోమవారం పలువురు ఆందోళన చేపట్టారు. మండల కేంద్రానికి చెందిన సోదరులు బోడ వాల్యా, బోడ పూన్యా మధ్య భూ వివాదం ఉన్నది. పూన్యా తన స్థలంలో ప్రైవేట్ పాఠశాల నడుపుతున్నాడు. సమీపంలోనే వాల్యా భూమి కూడా ఉంది. ఇద్దరి మధ్య కొన్నేళ్లుగా భూ వివాదం నెలకొంది. ఈ క్రమంలోనే సోమవారం పాఠశాలకు వెళ్లే దారిలో కంచె వేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, యువజన నాయకులు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్ఐ భూక్య శ్రీనివాస్ స్పందించి నచ్చజెప్పి కంచె తొలగింపజేయడంతో పాటు ఆందోళన విరమింపజేశారు. రాస్తారోకోతో రాకపోకలకు ఇబ్బంది కలిగించినవారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధురాలికి తీవ్రగాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు

బూర్గంపాడు: మండలంలోని సారపాకలోని ఐటీసీ ఈస్ట్‌గేట్ వద్ద సోమవారం లారీ ఢీ కొట్టడంతో వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. రోడ్డు పక్కన నడుచుకుంటూ వస్తుండగా లారీ ఢీ కొట్టింది. తీవ్ర గాయాలు కాగా ఆమెను స్థానికులు భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వృద్ధురాలి పూర్తి వివరాలు తెలియలేదు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు కూడా అందలేదు.

గాయపడిన మహిళ మృతి


మృతి చెందిన మేరి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల క్రాస్ రోడ్ సమీపంలో బైక్ డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఎస్ఐ ప్రవీణ్ కథనం ప్రకారం.. చుంచుపల్లి మండలం ఎన్‌కే నగర్ ప్రాంతానికి చెందిన నీరజ్, నిహారిక, విద్యానగర్ కాలనీకి చెందిన జలగం మేరి(30) ఈ నెల 3న పాల్వంచ పట్టణంలో బిర్యానీ తినేందుకు ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగొస్తుండగా డివైడర్‌ను ఢీకొని ప్రమాదం జరిగిన విషయం విదితమే. ఈ ఘటనలో నీరజ్, అతని చెల్లెలు నిహారిక అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ మేరిని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఆమె మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని ఎస్ఐ తెలిపారు.

ఐసీడీఎస్ అధికారుల బదిలీలు?

పీడీని డైరెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేసిన కలెక్టర్

అశ్వాపురం: ఐసీడీఎస్ బూర్గంపాడు ప్రాజెక్ట్‌లో సీడీపీఓ ప్రమీల అశ్వాపురం మండల పరిధిలోని అశ్వాపురం, మల్లెలమడుగు సెక్టార్ల సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, జగదాంబను డిప్యుటేషన్‌పై బదిలీ చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నట్టు సమాచారం. సూపర్‌వైజర్లు ధనలక్ష్మిని దుమ్ముగూడెం, జగదాంబను చర్ల, సీడీపీఓ ప్రమీలను అశ్వారావుపేటకు డిప్యుటేషన్‌పై పంపించేందుకు కలెక్టర్ అనుదీప్ ఐసీడీఎస్ ఉన్నతాధికారులకు సిఫార్సు చేసినట్టు తెలుస్తోంది. రెండు రోజుల్లో వరంగల్ ఆర్జేడీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందనున్నట్టు సమాచారం. బూర్గంపాడు ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదని, అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ సరిగా లేదని ఫిర్యాదులు రావడంతో ఇటీవల అశ్వాపురం మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలను స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయ అధికారి సందర్శించారు. ఆ అధికారి నివేదిక ప్రకారం సీడీపీఓ, సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం. డిప్యుటేషన్ నిలుపుదల చేసుకునేందుకు సీడీపీఓ, సూపర్‌వైజర్లు ఓ ప్రజాప్రతినిధి ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. విధుల్లో నిర్లక్ష్యం, సిబ్బందిపై నియంత్రణ లేకపోవడంతోపాటు పొరపాట్లను సరిదిద్దుకోవాలని ఎన్ని సార్లు చెప్పినా వినకపోవడం, తీరు మార్చుకోకపోవడంతో జిల్లా సంక్షేమ అధికారి వరలక్ష్మిని మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ గత నెల 21న కలెక్టర్ అనుదీప్ ఉత్తర్వులు జారీ చేశారు. పీడీగా స్వర్ణలత లెనినాను నియమించిన విషయం విదితమే.

సోషల్ మీడియా సమాజానికి ఉపయోగపడాలి


మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

పాల్వంచ: సోషల్ మీడియా సమాజ మార్పునకు ఉపయోగపడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం స్థానిక సీఆర్ భవన్‌లో ఉప్పుశెట్టి రాహుల్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సోషల్ మీడియా జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా ప్రజలను చైతన్యపర్చే వేదికగా నిలవాలని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, నాయకులు గుత్తుల సత్యనారాయణ, ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, వై.శ్రీనివాస రెడ్డి, రేసు ఎల్లయ్య, సునీల్‌కుమార్, పూర్ణచందర్ రావు, మురళి, ద్రసు, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: భార్యను వేధిస్తున్న వ్యక్తిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. కొంత కాలంగా తన భర్త నరేందర్ మద్యానికి బానిసై వరకట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని పట్టణంలోని రిక్షా కాలనీ చెందిన జ్యోతి అనే మహిళ ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా నరేందర్ ఆళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు సమాచారం.

ఇల్లెందులో..

ఇల్లెందురూరల్: మండలంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన వివాహిత స్రవంతి ఫిర్యాదు మేరకు ఆమె భర్త సుమన్, అత్తమామలు కొమరయ్య, పుష్పలపై పోలీసులు సోమవారం వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. 2013లో ఇందిరానగర్‌కు చెందిన స్రవంతికి భూపాలపల్లి జిల్లా ఘన్‌పూర్ గ్రామానికి చెందిన సుమన్‌తో వివాహం జరిగింది. కొద్దికాలంగా అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధిస్తుండటంతో భరించలేక ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో విచారించి, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజు తెలిపారు.

ట్రాలీ బోల్తా: ఇద్దరికి గాయాలు

సుజాతనగర్: ట్రాలీ బోల్తా పడి ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని స్టేషన్ బేతంపూడి గ్రామానికి చెందిన మంగీ అనే రైతు పాత అంజనాపురంలోని మిల్లులో ధాన్యాన్ని బియ్యం పట్టించి ట్రాలీలో తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో బేతంపూడి గ్రామం వద్ద మలుపు తిరుగుతుండగా ట్రాలీ అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఘటనలో మంగీకి గాయాలు కాగా, చుంచుపల్లి మండలానికి చెందిన సోమాకు కాలు విరిగింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానికులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.


బోల్తా పడిన ట్రాలీ

'దళితబంధు'తో ఆర్థికంగా ఎదగాలి

చింతకాని: దళితబంధు పథకం ద్వారా మంజూరైన యూనిట్లను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండ బాల కోటేశ్వరరావు సూచించారు. మండలంలోని గాంధీనగర్‌కాలనీలో దళితబంధు లబ్ధిదారులు ఏర్పాటుచేసుకున్న మెడికల్ షాప్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దళితుల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారని, సీఎం ఆలోచనకు అనుగుణంగా ఆర్థికాభివృద్ధి సాధించాలని తెలిపారు. కాగా, మండలంలోని తిమ్మినేనిపాలెంలో ఇటీవల మృతి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఆళ్ల వెంకటేశ్వర్లు కుటుంబాన్ని కోటేశ్వరరావు పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కాలంగి లలిత, దమ్మాలపాటి శ్రీదేవి, జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్‌తో పాటు గురిజాల హన్మంతరావు, పెంట్యాల పుల్లయ్య, కాలంగి చలమయ్య తదితరులు పాల్గొన్నారు.


మెడికల్ షాపును ప్రారంభిస్తున్న కొండబాల